క్లుప్తంగా

దేవస్థానానికి టికెట్ కౌంటర్ బహూకరణ



అంతర్వేది దేవస్థానానికి టికెట్ కౌంటర్ బహూకరించిన దాతలతో అర్చకులు

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానానికి శుక్రవారం రామేశ్వరానికి చెందిన దాతలు చెరుకూరి వంశీ లక్ష్మీపతిరాజు, పేరిచర్ల రామరాజు వర్మలు రూ.1.80 లక్షల విలువైన టికెట్ కౌంటర్‌ను బహూకరించారు. ఈ మేరకు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ పర్యవేక్షణలో సూపరింటెండెంట్ పి.విజయ సారథి సమక్షంలో ఆలయానికి వారు అందజేశారు. కాగా నూతన టికెట్ కౌంటర్‌కు అర్చకులు పూజలు నిర్వహించారు. దాతలు చేతుల మీదుగా టికెట్ కౌంటర్‌ను ప్రారంభించారు. ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

అభిమానుల ఆర్థిక సాయం



తోటి అభిమానికి ఆర్థిక సాయం అందించిన కృష్ణ-మహేశ్‌బాబు అభిమానులు

మలికిపురం: ఘట్టమనేని కృష్ణ, మహేశ్‌బాబు అభిమానులచే తోటి అభిమానికి వైద్యం నిమిత్తం ఆర్థికసాయం అందించారు. మలికిపురం టౌన్ వైడ్ వైస్ ప్రెసిడెంట్ మురాల ముఖేష్ ఇటీవల గుండె సంబంధిత ఆపరేషన్ చేయించుకున్నాడు. అతనికి అభిమానులు అందరూ కలసి రూ.పదివేలు సమకూర్చి ఆర్థిక సాయాన్ని శుక్రవారం అందించారు. కార్యక్రమంలో గోగన్నమఠం శ్రీనివాసరావు, నేతల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధిత పాడిరైతుకు సాయం



పాడిరైతు శ్రీనివాసుకు సాయం అందిస్తున్న దాత ప్రభాకరరావు

ఆలమూరు: మండలంలోని పెనికేరులో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో తీవ్రంగా నష్టపోయిన పాడిరైతు గోపు శ్రీనివాసుకు ఆర్థికసాయం అందజేత జరిగింది. స్థానిక మోదుకూరు రోడ్డులో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో రైతు శ్రీనివాసు పశువుల పాక, గడ్డి వాము దగ్ధమైంది. దీనిపై స్పందించిన ఆలమూరుకు చెందిన వ్యాపారవేత్త చల్లా ప్రభాకరరావు శుక్రవారం బాధిత రైతు శ్రీనివాసు నివాసానికి వెళ్లి రూ.పది వేల ఆర్థిక సాయం అందించారు. కోన శ్రీనివాసు, కొమ్ము నారాయుడు, జుత్తుక వెంకట్రావు, కర్రి బ్రహ్మాజీ, గొడవర్తి సూర్యప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

సేవలు ఆదర్శనీయం



ఎమ్మెల్యే దేవను కలసిన గుడ్‌విల్ సంస్థ సభ్యులు

రాజోలు: గుడ్‌విల్ సంస్థ నియోజకవర్గ ప్రజలకు అందిస్తున్న సేవలు ఆదర్శనీయమని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. శుక్రవారం సంస్థ అధ్యక్షురాలు కె.హవీలా, కార్యదర్శి ఇంజేటి ప్రశాంతి, సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ పట్టపు శ్యాంబాబులు, నాయకుడు బత్తుల రాము ఆధ్వర్యంలో ఎమ్మెల్యే దేవ వరప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. పాదలాడలో సంస్థ ఇటీవల ప్రారంభించిన వితంతువు, వృద్ధాశ్రమాన్ని సందర్శించాలని కోరారు.

ఎన్‌ఎంఎంఎస్‌కు విద్యార్థుల ఎంపిక

అంబాజీపేట: నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్‌ఎంఎంఎస్)కు అంబాజీపేట మండలంలోని జెడ్పీ హైస్కూళ్ల నుంచి ఆరుగురు విద్యార్థులు ఎంపికైనట్లు ఎంఈఓలు కె.వెంకటేశ్వరరావు, ఎం.ప్రకాష్ తెలిపారు. అంబాజీపేట నుంచి నెల్లి యామిని, ముత్తాబత్తుల నిశియాంజల్, గర్పప్పు అతినాప్రసాద్, తొండవరం నుంచి పెదమల్లు శ్రీమనస్విని, గంగలకుర్రు అగ్రహారం చొల్లంగి జాహ్నవి శివదుర్గ, దొంగ లేఖనా మహాలక్ష్మిలు ఎన్ఎంఎంఎస్‌కు ఎంపికయ్యారన్నారు. ఎంపికైన విద్యార్థులకు తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు నాలుగేళ్ల పాటు ఏడాదికి రూ.12 వేలు చొప్పున కేంద్ర ప్రభుత్వం స్కాలర్‌షిప్ ఇవ్వనుందన్నారు. ఎన్ఎంఎంఎస్ ఎంపికైన విద్యార్థులను ఎంఈఓలతో పాటు హెచ్‌ఎంలు, సీఆర్పీలు, పీఎంసీ చైర్మన్‌లు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు అభినందనలు తెలిపారు.

వ్యవసాయం ఇదేనా..!

- ఏడాదయినా అందని సాయం
- మూడో పంటొచ్చినా సుఖీభవ లేదు
- అగమ్యగోచరంగా రైతన్న పరిస్థితి



మొసలపల్లిలో వరి పంటకు మందు పిచికారీ చేస్తున్న రైతులు (ఫైల్)

అంబాజీపేట: కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో రైతులకు ఇచ్చిన ఏ ఒక్క హామీ కూడా అమలు కాలేదు. ఆరుగాలం కష్టపడి రైతన్నలు పండిస్తున్న పంటలకు సరైన గిట్టుబాటు ధర లభించడం లేదు. రైతు సంక్షేమాన్ని పూర్తి విస్మరించింది. వైఎస్సార్ సీపీ హయాంలో నాటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వ్యవసాయ రంగానికి పెద్దపీట వేశారు. రూ.కోట్లు వెచ్చించి ఆర్బీకేలను నిర్మించారు. విత్తనం నుంచి పంట కొనుగోలు చేసే వరకూ మొత్తం ఆర్బీకేల ద్వారా నిర్వహించారు. రైతు భరోసా ద్వారా ఏడాదికి రూ.15 వేలు చొప్పున రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం రైతులకు పెట్టుబడి సహాయం అందించలేదు. ఎరువులు, విత్తనాలు, పురుగుమందుల పంపిణీ కూడా ప్రశ్నార్థకంగా మారింది. ఏడాది కాలంలో రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నామమాత్రంగానే ఎరువుల కోసం ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. పండించిన ధాన్యం కూడా అమ్ముకునేందుకు అనేక అవస్థలు పడే పరిస్థితి ఏర్పడింది. ఆర్బీకేలను నిర్వీర్యం చేశారు. రైతులకు సలహాల కోసం ఏర్పాటు చేసిన కియోస్క్ యంత్రాలు మూలన పడ్డాయి. ప్రస్తుత పాలన చూసి వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనను గుర్తు చేసుకుంటున్నారు. జగనన్న ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన రైతు భరోసా పథకం పేరును అన్నదాత సుఖీభవ అంటూ మార్చారే తప్ప సాయం మాత్రం అందించలేదు. గత ఏడాది జూలై నుంచి ఖరీఫ్ సీజన్ ప్రారంభం నుంచే వర్షాలు అనుకులంగానే కురిశాయి. ఈ పంటతో కలిపి మూడు పంటల పెట్టుబడి సాయం అందకపోవడంతో రైతులు నిరాశకు గురవుతున్నారు. దేవుడు కరుణించినా పూజారి కరుణించలేదన్న సామెత చందంగా కూటమి ప్రభుత్వం నుంచి పెట్టుబడి సాయం అందకపోవడంతో రైతులు నిరాశకు గురవుతున్నారు. రాజోలు, పి.గన్నవరం, కొత్తపేట నియోజకవర్గాల్లోని 11 మండలాలకు సంబంధించి 83 వేల మంది రైతులు, కౌలు రైతులు ఉన్నారు. పి.గన్నవరంలో 26,382, కొత్తపేటలో 34,702, రాజోలులో 8,650 ఎకరాల్లో వరి సాగు చేపట్టారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రైతులకు కష్టాలు మొదలయ్యాయి. అన్నదాత సుఖీభవ ద్వారా ప్రతి రైతుకు ఏడాదికి రూ.20 వేలు అందిస్తామని ఎన్నికల్లో వాగ్దానం చేసి అమలు చేయలేదు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రారంభంలోనే పెట్టుబడి సాయం

గతంలో పంటల సాగు పెట్టుబడి కోసం రైతన్నలు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సాగు ఆరంభంలోనే పెట్టుబడి సాయాన్ని అందించేది. పీఎం కిసాన్ సాయం రూ.6 వేలు, రైతు భరోసా రూ.7,500 కలిపి ఏటా రూ.13,500 చొప్పున మూడు విడతలుగా రైతులకు అందేది. ఇప్పుడు పీఎం కిసాన్ రూ.6 వేలు తప్ప అన్నదాతా సుఖీభవ సాయం రూ.14 వేల ఊసే లేదు. ఏడాది నుంచి రైతులు పెట్టుబడి సాయం అందక కష్టాలను ఎదురీదుతున్నారు.

రెండు పంటలు పూర్తయినా



గత ప్రభుత్వంలో పెట్టుబడి సాయం ఖరీఫ్ పంట ప్రారంభంలోనే అందేది. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ జరుగుతున్న రెండు పంటలు పూర్తయి, మూడో పంట వేసేందుకు సిద్ధంగా ఉన్నా ఇప్పటి వరకు ప్రభుత్వం పెట్టుబడి సాయం ప్రకటించలేదు. రైతులు వడ్డీలకు సొమ్ములు తెచ్చి సార్వా పెట్టుబడులు పెడుతున్నారు. సమయానికి కూటమి ఇస్తానన్న సాయం రూ.20 వేలు ఇస్తే బాగుంటుంది.

– దొమ్మేటి రాధా సూర్యనారాయణ, రైతు, ఇరుసుమండ

యోగాతో మానసిక దృఢత్వం



ఆలమూరు యోగా శిక్షణ తరగతుల్లో పాల్గొన్న అధికారులు

ఆలమూరు: యోగా చేయడం ద్వారా మానసిక దృఢత్వంతో పాటు సంపూర్ణ ఆరోగ్యం సముపార్జించవచ్చని ఎంపీడీఓ ఎ.రాజు, తహసీల్దార్ కేజే ప్రకాష్‌బాబు అన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో జరుగుతున్న యోగా శిక్షణ తరగతులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు యోగా నేర్చుకుని అందులోని మెళకువలను ప్రజలకు తెలియజేయాలన్నారు, తద్వారా ప్రజలకు యోగాపై ఆసక్తిని కలిగించాలన్నారు. గ్రామ సచివాలయాల్లో ప్రతి రోజు యోగా డేను నిర్వహించాలన్నారు. జూన్ 21న జరిగే యోగా డేలో మండల వ్యాప్తంగా అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొనే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. మండలంలోని ఆయా గ్రామ సచివాలయాల పరిధిలో నిర్వహిస్తున్న శిక్షణ తరగతులపై ఎంపీడీఓ రాజు, తహసీల్దార్ ప్రకాష్‌బాబు సంతృప్తిని వ్యక్తం చేశారు.

శిక్షణ తరగతులతో ఎంతో మేలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎంఈఓ లక్ష్మీనారాయణ



మలికిపురంలో విజేతలకు బహుమతులు అందిస్తున్న భాస్కరరావు

మామిడికుదురు: వేసవి శిక్షణ తరగతులతో విద్యార్థులకు ఎంతో మేలు జరిగిందని ఎంఈఓ లక్ష్మీనారాయణ తెలిపారు. మామిడికుదురులో గ్రంథాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో శిక్షణ తరగతుల సందర్భంగా ఏర్పాటు చేసిన వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. గ్రంథాలయాధికారి ఏకేవీఆర్ సూర్యనారాయణ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఎంఈఓ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ గ్రంథాలయాల్లో విద్యార్థులకు ఉపయోగపడే పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు ఎన్నో అందుబాటులో ఉన్నాయన్నారు. గ్రంథాలయాల సేవలను విద్యార్థులు వినియోగించుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సీహెచ్ కేశవరావు, టి.బాలబాలాజీ, స్థానికులు ఎం.సీతారామచంద్రమూర్తి, ఈదరాడ, పాశర్లపూడిలంక బీడీసీలు యెరుబండి కన్నబాబు, ఎస్ఎల్‌టీ దేవి పాల్గొన్నారు.

అంబాజీపేటలో..

అంబాజీపేట: ఉపాధ్యాయులు, పెద్దలు చెప్పే ప్రతి విషయాన్ని విని నేర్చుకోవడం విద్యార్థులకు ఉండవలసిన ఉత్తమ లక్షణమని ఎంఈఓ మోకా ప్రకాష్, హెచ్‌ఎం కడలి సాయిరామ్ అన్నారు. అంబాజీపేట శాఖా గ్రంథాలయంలో గత నెల రోజులుగా నిర్వహించిన వేసవి విజ్ఞాన శిక్షణ ముగింపు కార్యక్రమం గ్రంథాలయ రికార్డు అసిస్టెంట్ జి.శ్రీనివాస్ అధ్యక్షతన శుక్రవారం జరిగింది. వారు మాట్లాడుతూ బాల్యం, యవ్వనంలోనే నేర్చుకొని, చదువుకునే అవకాశం లభిస్తుందని, సద్వినియోగం చేసుకున్నప్పుడే జీవితంలో ఉన్నతంగా ఎదుగుతామన్నారు. చెడు అలవాట్లకు లోనుకాకుండా, చదువును నిర్లక్ష్యం చేయకుండా మంచి ప్రణాళికతో విద్యార్థులు ముందుకు సాగాలన్నారు. శిక్షణ శిబిరానికి వచ్చిన విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలు, మెడల్స్ అందజేశారు. అనంతరం కార్యక్రమంలో నందికం వెంకటేశ్వరరావు, రీడర్స్ పాల్గొన్నారు.

మలికిపురంలో..

మలికిపురం: మండలంలోని మలికిపురం, కేశనపల్లి, లక్కవరం శాఖా గ్రంథాలయాల్లో గత నెల రోజులుగా జరుగుతున్న వేసవి శిక్షణ తరగతుల ముగింపు వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఈ శిక్షణ తరగతులను పిల్లలు బాగా ఉపయోగించుకున్నారని ఆయా గ్రంథాలయాధికారులు,కె. ఇందిర, బి.రాజేంద్రకుమార్ పేర్కొన్నారు. ముగింపు వేడుకకు స్థానిక సర్పంచ్‌లు గెడ్డం ఝాన్సీలక్ష్మి, ఎనుముల వెంకటనాగు అధ్యక్షత వహించారు. వేసవి సెలవుల్లో పిల్లలు సెల్‌ఫోన్‌కి ఎడిక్ట్ కాకుండా, కాలయాపన చేయకుండా గ్రంథాలయానికి వచ్చి వివిధ అంశాల్లో శిక్షణ పొందడం ఆనందదాయకమని ముఖ్య అతిథులు అన్నారు. వివిధ అంశాల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. గెడ్డం తులసీ భాస్కరరావు, ఎంపీటీసీ రాపాక సత్యనారాయణ, గ్రంథాలయ స్థలదాత యర్రంశెట్టి గోపాలకృష్ణ, ఉలిశెట్టి లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

బాధితుడికి సాయం అందజేత

సాక్షి ఇంపాక్ట్

కొత్తపేట: ప్రమాదవశాత్తూ సైకిల్‌పై నుంచి పడిపోయి మంచానికి పరిమితమైన షేక్ అహ్మద్ యాకూబ్ ఆలీషా కుటుంబ దయనీయ పరిస్థితిపై మానవతా దృక్పథంతో కాకినాడకు చెందిన రిటైర్డ్ చీఫ్ లేబర్ ఆఫీసర్ (సీఎల్‌ఓ) వి.శ్రీనివాసరావు రూ.10 వేలు సాయం అందజేశారు. స్థానిక కొప్పిశెట్టివారి వీధిలో నివాసం ఉంటున్న సుమారు 48 ఏళ్ల షేక్ అహ్మద్ యాకూబ్ ఆలీషాకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. తాపీ మేస్త్రీ వద్ద కూలీగా చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. గతేడాది నవంబరులో ప్రమాదవశాత్తూ పడిపోవడంతో మెడ కింద వెన్నుపూస నరాలు నలిగిపోయి కాళ్లు చచ్చుబడిపోయాయి. మంచానికి పరిమితమైయ్యాడు. ఆపరేషన్‌కు పెద్ద మొత్తంలో ఖర్చవుతుంది. ఆ కుటుంబానికి అంత ఆర్థిక స్తోమత లేదు. చదువుకుంటున్న కొడుకు చదువుకు స్వస్తిచెప్పి కూలి పనికి వెళుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ కుటుంబ పరిస్థితిపై గత నెల 18న 'సాక్షి'లో 'ఆ ఇంట్లో పెద్ద కష్టం' శీర్షికన ప్రచురితమైన కథనంపై రిటైర్డ్ సీఎల్‌ఓ శ్రీనివాసరావు స్పందించారు. శుక్రవారం బాధితుడి కుమారుడు షేక్ హరుణ్ రషీద్ అకౌంట్‌కు ఫోన్ పే ద్వారా రూ.10 వేలు ట్రాన్స్‌ఫర్ చేసినట్టు కరప మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాపీలు తెలిపారు. దాత శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ తాపీలుకు రషీద్ కృతజ్ఞతలు తెలిపాడు. దయనీయ స్థితిలో ఉన్న ఆ కుటుంబానికి దయార్ద్ర హృదయులు ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలని పలువురు స్థానికులు కోరారు.

ప్రతిభా అవార్డులకు విద్యార్థుల ఎంపిక



సయ్యద్ రషీదా బేగం



అమలదాసు నాగవెంకటలక్ష్మి

కొత్తపేట: 2024–25 విద్యా సంవత్సరం పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో మండలం నుంచి అత్యుత్తమ ఫలితాలు సాధించిన ఏడుగురు విద్యార్థులు ఏపీజే అబ్దుల్ కలాం ప్రతిభా పురస్కారాలకు ఎంపికయ్యారు. కాంతిభారతి హైస్కూల్ నుంచి కురచ తన్మయిశ్రీలక్ష్మి షణ్ముఖి, జెడ్పీ బాలికోన్నత పాఠశాల నుంచి సయ్యద్ రషీదా బేగం, పలివెల సెంట్‌జాన్స్ హైస్కూల్ నుంచి జక్కంశెట్టి హర్షిత, కొత్తపేట ఆక్స్‌ఫర్డ్ హైస్కూల్ నుంచి కొమ్ముల సుందరశ్రీవీరగనికమ్మ, భాష్యం హైస్కూల్ నుంచి మందూరి సాయి సత్య ఆశ్లేష, ప్రజ్ఞ హైస్కూల్ నుంచి తరిట్ల సూర్యరాజు, వానపల్లి తొత్తుపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి అమలదాసు నాగవెంకటలక్ష్మి ప్రతిభా పురస్కారాలకు ఎంపికయ్యారు. వారికి రూ 20 వేలు నగదు ప్రోత్సాహంతో పాటు సర్టిఫికెట్, మెడల్‌ను ఈ నెల 9 న ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల చేతులు మీదుగా ప్రధానం చేస్తారు.

పారిశుధ్య చర్యలతో దోమల నిర్మూలన



సంధిపూడిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య, ఆరోగ్య సిబ్బంది

ఆలమూరు: గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి శుక్రవారం నిర్వహిస్తున్న డ్రైడే విధానంతో సంపూర్ణ పారిశుధ్యం నెలకొల్పడం ద్వారా దోమల ఉధృతిని నివారించవచ్చని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు ఎస్.లక్ష్మీస్నేహ, డి.సాయికిషోర్ అన్నారు. ఫ్రైడే సందర్భంగా ఆయా గ్రామాల్లోని ఆరోగ్య, ఆశ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఇంట్లో నిల్వ నీరు ఉండకుండా తీసుకోవలసిన చర్యలను వివరించారు. రుబ్బురోళ్లు, కొబ్బరి చిప్పలు, ఖాళీ సీసాలు, వ్యర్థాలను ఇంట్లో ఉండకుండా చూడాలని మహిళలకు సూచించారు. దీనివల్ల క్రిమి, కీటకాలు దరిచేరవని, తద్వారా అంటువ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉండదన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించి మెరుగైన ఆరోగ్యకర సమాజాన్ని నెలకొల్పాలని ప్రజలను కోరారు. వివిధ గ్రామాల్లో ఆరోగ్య, ఆశ సిబ్బంది డ్రైడేను వివరిస్తూ భారీ ర్యాలీలు నిర్వహించారు. అలాగే డ్రైడేతో పాటు మలేరియా నివారణ మాసోత్సవాలను నిర్వహించి దోమల నిర్మూలనకు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. సీహెచ్‌ఓ ఎంఎస్ఎన్ రెడ్డి, ఎంపీహెచ్‌ఈఓ కె.జ్యోతి కుమార్, హెల్త్ ఎడ్యుకేటర్లు ఏవీవీ రాజా, బి.సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.శివప్రసాద్, పి.ఉమ, ఆర్.బాలమణి తదితరులు వైద్యసేవలను పర్యవేక్షించారు.

రీ వెరిఫికేషన్‌లో పెరిగిన మార్కులు



ముత్యాల సాయిసహస్ర

మామిడికుదురు: మామిడికుదురుకు చెందిన ముత్యాల సాయి సహస్ర ఇటీవల పదో తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించారు. మొదట ఆమెకు 593 మార్కులు వచ్చాయి. రీ వెరిఫికేషన్‌కు అప్లై చేయగా 597 మార్కులు వచ్చాయి. రీ వెరిఫికేషన్‌లో ఆమెకు నాలుగు మార్కులు పెరిగాయి. తద్వారా సాయి సహస్ర మండల స్థాయి ప్రథమంలో నిలిచారు. తెలుగు, జనరల్ సైన్స్, మ్యాథ్స్, సోషల్ సబ్జెక్టుల్లో నూటికి నూరు మార్కులు రాగా హిందీలో 98, ఇంగ్లిషులో 99 మార్కులు వచ్చాయి. రీ వెరిఫికేషన్‌లో మార్కులు పెరిగి ప్రథమ స్థానం సాధించిన సాయి సహస్రను శుక్రవారం పలువురు అభినందించారు.

ఘనంగా గజమాల యాత్ర



మామిడికుదురులో గజమాల యాత్ర ఊరేగింపు

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి వారి కల్యాణం సందర్భంగా దేవస్థానం వ్యవస్థాపకుడు మొల్లేటి రామస్వామి, ఆదిలక్ష్మి దంపతుల మెడలో ఆవిష్కరించే గజమాల యాత్ర ఊరేగింపు శుక్రవారం ఘనంగా జరిగింది. రాజోలు తాలూకా శెట్టిబలిజ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రాజోలు మండలం తాటిపాక శెట్టిబలిజ సంఘం భవనం నుంచి కేరళ వాయిద్యాలు, బాణసంచా కాల్పులు, యువకుల ఉత్సాహం నడుమ ప్రారంభమైన యాత్ర మామిడికుదురు బస్టాండ్ కూడలి నుంచి పాశర్లపూడి కొండాలమ్మ చింత సెంటర్ మీదుగా అప్పనపల్లి వరకు సాగింది. అప్పనపల్లి ఆలయం ప్రాంగణంలో ఉన్న రామస్వామి, ఆదిలక్ష్మి దంపతుల విగ్రహాలకు గజమాలను అలంకరించారు. శెట్టిబలిజ సంఘం యువత మోటార్ సైకిళ్ల ర్యాలీలో ఎంతో ఉల్లాసంగా, ఉత్సాహంగా గజమాల యాత్రలో పాల్గొన్నారు. యాత్రలో మండల శెట్టిబలిజ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కాండ్రేగుల శ్రీనివాస్, సంఘం ప్రతినిధులు నయినాల కాశీ, యాండ్ర వీరబాబు, జోగి వెంకటరామకృష్ణ, నయినాల రామకృష్ణ, పెచ్చెట్టి సత్యచంద్రరావు, కడలి నూకరాజు, పితాని సురేంద్ర, బొక్కా రవి, పెద్దిరాజు, మొల్లేటి శ్రీనివాస్, మామిడిశెట్టి శివరామప్రసాద్ పాల్గొన్నారు.

నేటి తరానికి ఆదర్శ చిత్రాలు నిర్మించాలి



గంగలకుర్రులో దర్శక, నిర్మాత రాహుల్‌రాయ్‌ను సత్కరిస్తున్న గ్రామస్తులు

అంబాజీపేట: ప్రస్తుత సమాజంలో నేటి తరానికి ఉపయోగపడేలా ఆదర్శవంతమైన చిత్రాలను నిర్మించాలని జిల్లా పౌరసరఫరాల అధికారి అడపా ఉదయ భాస్కర్ పేర్కొన్నారు. గంగలకుర్రు అరిగెల వారి కోనసీమ బృందావన రిసార్ట్స్‌లో వారణాశి చిత్రయూనిట్ బృందం సన్మాన సభ కోకోఫెడ్ చైర్మన్, కళా పరిషత్ అధ్యక్షుడు అరిగెల బలరామమూర్తి అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోనసీమ అందాలు.. మంచి కథనాయకులు.. విభిన్న కథతో మంచి చిత్రాన్ని రూపొందించి ప్రేక్షకులకు అందించాలని కోరారు. వారణాశి చిత్రాన్ని యూట్యూబ్లో రిలీజ్ చేయడం ద్వారా మంచి స్పందన వచ్చిందన్నారు. ఏకాదశ రుద్రుల్లో ఒక్కరైనా గంగలకుర్రు చెన్నమల్లేశ్వరస్వామి గ్రామంలో చిత్ర యూనిట్‌కు సత్కారం జరగడం అదృష్టమన్నారు. అనంతరం చిత్ర దర్శక, నిర్మాత అడబాల రాహుల్‌రాయ్‌తో పాటు నటీ నటులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ కాండ్రేగుల శ్రీనివాస్, నాగార్జున సాగర్, యేడిద శ్రీను, శిరిగినీడి వెంకటేశ్వరరావు, కె.శంభూప్రసాద్, ఎస్వీ నాయుడు, నాగాబత్తుల నరసింహం, నూకపెయ్యి చిన్న పాల్గొన్నారు.

వీరేశ్వరస్వామి సేవలో కొత్తపేట ఆర్డీవో దంపతులు

ఐ.పోలవరం: మురమళ్లలో కొలువైన భద్రకాళీ వీరేశ్వరస్వామి సన్నిధిని శుక్రవారం కొత్తపేట ఆర్డీవో దంపతులు అఖిల, పి.శ్రీకర్ దంపతులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారు స్వామి వారిని దర్శించుకుని వారు పూజలు చేశారు. తొలుత వీరికి ఆలయ అర్చకులు బ్రహ్మశ్రీ పేకేటి శ్యామలకుమార్ ప్రత్యేక దర్శనాన్ని కల్పించారు. అనంతరం వారికి స్వామివారి శేషవస్త్రం, చిత్రపటం, ప్రసాదం అందించి వేదాశీర్వచనం చేశారు. ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి మాచిరాజు లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

విద్యార్థుల కోసం బస్సు సర్వీసులు



సత్యనారాయణమూర్తి, డిపో మేనేజర్, అమలాపురం

అమలాపురం రూరల్: విద్యార్థుల పాఠశాలలు, కళాశాలలకు వెళ్లేందుకు వీలుగా ఉండే సమయంతో ఆయా రూట్లలో బస్సు సర్వీసులు ఏర్పాటు చేశామని అమలాపురం ఆర్టీసీ డిపో మేనేజర్ చల్లా సత్యనారాయణమూర్తి శుక్రవారం తెలిపారు. కళాశాలలు ఇప్పటికే తెరవడంతో బస్ పాస్‌ల జారీ ప్రక్రియను ప్రారంభించామని ఆయన తెలిపారు. 50 కిలోమీటర్ల పరిధి వరకు బస్సు పాసులు జారీ చేస్తున్నామన్నారు. సదరం సర్టిఫికేట్ పొందిన దివ్యాంగులకు 50 శాతం రాయితీతో బస్సు పాస్‌లు జారీ చేస్తున్నట్టు ఆయన తెలిపారు. అక్షరాస్యతా శాతాన్ని పెంచేందుకు 12 ఏళ్ల లోపు బాలురు, 18 ఏళ్ల లోపు బాలికలకు ఉచితంగా బస్ పాసులను, మిగిలిన వారికి రాయితీతో పాసులు ఆర్టీసీ జారీ చేస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ పాస్‌లు ఏడాది వరకు చెల్లుబాటు అవుతాయన్నారు. పాస్‌కు నిర్దేశించిన ధరతో పాటు సంవత్సరం గుర్తింపు కార్డు కోసం రూ.100, నెలవారీ గుర్తింపు కార్డు రూ.50, సర్వీసు చార్జీ రూ.40 అదనంగా చెల్లించాల్సి ఉంటుందన్నారు. అమలాపురం ఆర్టీసీ డిపోలో ప్రజారవాణా శాఖ బస్‌పాస్ కౌంటర్‌ను ప్రారంభించినట్టు డీఎం తెలిపారు.

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి

ఏపీఎస్ఆర్టీసీ ఆన్‌లైన్ వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకుని దరఖాస్తు చేసుకోవాలని డిపో మేనేజర్ తెలిపారు. కళాశాల విద్యార్థులు 10వ తరగతి మార్కుల జాబితా, ఆధార్ కార్డు జెరాక్స్ కాపీ జత చేయాలన్నారు. స్టడీ సర్టిఫికేట్‌తో పాటు రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, సెల్ నంబరు ఇవ్వాలని, దరఖాస్తులను పరిశీలించిన అనంతరం పాసు మంజూరుకు సిఫార్సు చేస్తామని తెలిపారు.

జాతీయ పోలీస్ పవర్ లిఫ్టింగ్ పోటీలకు అప్పన్న ఎంపిక



జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికైన పోలీస్ కానిస్టేబుల్ అప్పన్నను సత్కరించిన జిమ్ క్రీడాకారులు

అమలాపురం టౌన్: అమలాపురం హెల్త్ అండ్ ఫిట్‌నెస్ జిమ్‌లో శిక్షణ పొందిన ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక పోలీస్ దళం కానిస్టేబుల్ బి.అప్పన్న ఆల్ ఇండియా నేషనల్ పోలీస్ పవర్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల నాగార్జున యూనివర్సిటీలో నిర్వహించిన పోలీస్ విభాగం సెలెక్షన్స్ ట్రయల్స్‌లో అప్పన్న అత్యుత్తమ ప్రతిభ చాటి జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికయ్యారని అమలాపురం హెల్త్ అండ్ ఫిట్‌నెస్ జిమ్ కోచ్ డాక్టర్ కంకిపాటి వెంకటేశ్వరరావు తెలిపారు. జాతీయ పోటీలకు ఎంపికైన కానిస్టేబుల్ అప్పన్నను స్థానిక జిమ్‌లో శుక్రవారం ఉదయం నిర్వహించిన అభినందన సభలో ఆయనను జిమ్ క్రీడాకారులు ప్రశంసించి, సత్కరించారు. శ్రీకాకుళానికి చెందిన అప్పన్న ప్రస్తుతం అల్లవరం మండలం ఓడలరేవు మెరైన్ విభాగంలో కానిస్టేబుల్‌గా పనిచేస్తూ పవర్ లిఫ్టింగ్‌లో జిల్లా, రాష్ట్ర స్థాయిలో విజేతగా నిలిచి జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో జిమ్ క్రీడాకారులు అల్లాడ వెంకటరమణ, ఎంవీ సముద్రం తదితరులు కానిస్టేబుల్ వీరన్నను సత్కరించి అభినందించారు.

హైఓల్టేజీ కారణంగా కాలిపోయిన విద్యుత్ పరికరాలు

అమలాపురం రూరల్: సమనస గ్రామంలో శుక్రవారం తెల్లవారుజామున జరిగిన విద్యుత్ ప్రమాదంలో విద్యుత్ పరికరాలు కాలిపోయాయి. స్టేట్ బ్యాంక్‌తో పాటు సమీప గృహాల్లో విద్యుత్ మీటర్లు, విద్యుత్ పరికరాలు హైఓల్టేజ్ కారణంగా కాలిపోయాయి. ఒక్కసారిగా పొగలు, మంటలు రావడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. బాధితులు అగ్నిమాపక, విద్యుత్ శాఖాధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఘటనా స్థలానికి చేరుకున్న అధికారులు, సిబ్బంది ఇసుక సహాయంతో మంటలను అదుపు చేసారు. ఈ ప్రమాదం తెల్లవారుజామున కావడంతో పెను ప్రమాదం తప్పిందని బాధితులు వాపోయారు. స్థానికంగా విద్యుత్ హెచ్చు తగ్గుల సమస్య ఉందని, నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని పలుమార్లు అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదని స్థానికులు చెబుతున్నారు.